ఏళ్ల కల ఫలించిన వేళ..!

'చెంతనే చెరువులు ఉన్నా.. మా నీటి చింత తీరదాయె'.. 'నెత్తి మీద చెరువులు.. నీటికేమో చింతలు'.. ఇవి దశాబ్దాలుగా గండిపేట మండల ప్రజల దాహార్తిపై పత్రికల్లో వచ్చిన కథనాలు. మండల పరిధిలోని 14 గ్రామాల్లో ఎప్పుడూ నీటి సమస్య వచ్చినా పక్కనే చెరువులు ఉన్నా నీటిని వాడుకోలేకపోతున్నామని ప్రజాప్రతినిధులు, ప్రజలు వాపోయే పరిస్థితి. అయితే ఎట్టకేలకు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ 2 రోజుల క్రితం గండిపేట నీటిని తాగే అవకాశం ముందుగా మణికొండ ప్రజలకు దక్కింది.

– మణికొండ

- ఎట్టకేలకు అందుబాటులోకి గండిపేట నీరు
- ముందుగా మణికొండవాసులకు సరఫరా
- త్వరలో మరో మూడు ఫిల్టర్‌బెడ్‌ల ఏర్పాటు
- అందుబాటులోకి రానున్న 14 లక్షల లీటర్ల అదనపు నీరు


ఉస్మాన్‌సాగర్ (గండిపేట) చెరువు


మణికొండలో ఏర్పాటు చేసిన గండిపేట నీటి ఫిల్టర్ బెడ్

1821లో నిర్మాణం ..

గండిపేట మండల పరిధిలోనే ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ చెరువులను అప్పటి గోల్కొండ నవాబ్ మీర్ ఉస్మాన్‌ఆలీఖాన్ 1821లో నిర్మించారు. నాటి నుంచి అవి హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. వాటి పక్కనే గండిపేట మండలపరిధిలోని 14 గ్రామాలు ఉన్నా ఆ నీటిని వాడుకోలేని పరిస్థితి ఉండేది. చెరువులు గ్రామాలకు పై భాగంలో ఉండడం, వాటి వద్ద కాకుండా నగరంలో మాత్రమే ఫిల్టర్ బెడ్‌లు ఉండడంతో అక్కడ శుద్ధి అయిన నీరు తిరిగి వెనక్కి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ నీరు నగర ప్రజలకే అందుతుండేది. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంజీరా, కృష్ణా, గోదావరి నుంచి వందల కిలోమీటర్లు వ్యయ, ప్రయాసలతో నీటిని తరలిస్తున్నారు. అయితే గండిపేట, హిమాయత్‌సాగర్ నుంచి మాత్రం గ్రావిటీ పద్ధతిలోనే నీరు హైదరాబాద్ చేరుతుంది. వాటిని నిర్మాణ సమయంలో గండిపేట మండలపరిధిలోని 14 గ్రామాలు చిన్నవి కావడంతో వాటి నీటి అవసరాల గురించి అప్పట్లో ఆలోచన చేయలేదు. పంచాయతీలుగా ఉన్నప్పటి వరకు బోర్ల నీటితోనే అవసరాలు తీర్చుకున్నాయి. కొన్ని గ్రామాలు జలమండలి నుంచి బల్క్ కనెక్షన్ రూపంలో కొన్నేళ్ల క్రితం మంజీరా నీటిని వాడుతున్నాయి. మున్సిపాలిటీలుగా ఆవిర్భవించిన తర్వాత నీటి సరఫరా బాధ్యతను పూర్తి స్థాయిలో గత ప్రభుత్వం జలమండలికి అప్పగించింది.

ఐదేళ్ల క్రితం ప్రణాళిక చేసినా..

గండిపేట చెరువు నీటిని మణికొండలోనే ఫిల్టర్ చేసి స్థానిక ప్రజలకు సరఫరా చేయాలనే ఆలోచన ఐదేళ్ల క్రితం అప్పటి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దాన కిశోర్ చేశారు. అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన వర్టికల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను మణికొండలో 3 లక్షల లీటర్లు, పుప్పాలగూడలో 2 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్నవి ఏర్పాటు చేశారు. అయితే అప్పట్లో గండిపేటలో నీరు తక్కువగా ఉండడం, బురద నీటిని పంపింగ్ ద్వారా తీస్తుండడం, వాటిని పూర్తిస్థాయిలో ఫిల్టర్ చేయడం సాధ్యం కాకపోవడంతో ప్రారంభించిన రెండు రోజులకే అవి మూతపడ్డాయి.

ఎట్టకేలకు ఫలితం..

ప్రస్తుతం మంజీరా నీటి పైప్‌లైన్లు తరచూ పగిలిపోతుండడంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గతంలో ఏర్పాటు చేసిన వర్టికల్ ఫిల్టర్లను తిరిగి వినియోగించుకోవాలని ఆలోచన చేసిన అధికారులు వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రారంభించారు. దాంతో మొదటగా మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న 3 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఫిల్టర్ బెడ్ ద్వారా అదనపు నీరు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పుప్పాలగూడ బీఆర్‌సీ సమీపంలోని మరో ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే అక్కడి శుద్ధి అయ్యే నీటిని నార్సింగి, అలకాపూర్ టౌన్‌షిప్ ప్రజలకు సరఫరా చేసేందుకు జలమండలి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మరో మూడు ఫిల్టర్ బెడ్‌లు..

మణికొండలో 3 లక్షలు, పుప్పాలగూడలో 2 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఫిల్టర్ బెడ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటికి తోడు మరో 3 ఫిల్టర్ బెడ్‌లు 3 లక్షల సామర్థ్యం చొప్పున మొత్తం 9 లక్షల లీటర్ల నీటిని అదనంగా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు పుప్పాలగూడ ఎల్‌ఐసీ కాలనీ, కోకాపేట ప్రభుత్వ పాఠశాల, గండిపేట ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు పనులు మొదలు పెట్టారు. అవి పూర్తయితే మొత్తం 14 లక్షల లీటర్ల నీరు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలకు అందుబాటులోకి రానుంది.

హిమాయత్‌సాగర్‌కు ఏర్పాటు చేయాలి..

గండిపేట చెరువు నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలిస్తున్న క్యాండూట్‌పై ఏర్పాటు చేస్తున్న ఫిల్టర్ బెడ్‌ల తరహాలోనే హిమాయత్‌సాగర్ నుంచి నీటిని తీసుకెళ్తున్న క్యాండూట్ పైనా అక్కడక్కడా ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం కృష్ణా నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోవడం లేదని, వారంలో రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారని వారు పేర్కొంటున్నారు. గండిపేట క్యాండూట్‌పై ఏర్పాటు చేస్తున్న తరహాలోనే హిమాయత్‌సాగర్ నీటిని స్థానికులకు అందిస్తే ఉపశమనం కలగడంతో పాటు శాశ్వతంగా నీటి అవసరాలకు ఇబ్బంది ఉండదని వారు కోరుతున్నారు.

చిన్ననాటి కల నెరవేరింది..



గండిపేట నీటిని తాగాలని చిన్నప్పటి నుంచి కలలు కనేవాళ్లం. స్నానాలు, దుస్తులు వాష్ చేసుకునేందుకు క్యాండూట్‌లో నుంచి తీసుకుని వాడుకున్నాం. అయితే ఫిల్టర్ కాలేదనే కారణంతో తాగే వాళ్లం కాదు. ప్రస్తుతం మణికొండలోనే ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తుండడంతో మా కల నెరవేరినట్లయ్యింది. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న గండిపేట నీరు ఆరోగ్య పరంగా కూడా ఎంతో మంచిదనే నానుడి ఉంది.

– కె. పూర్ణచంద్రారెడ్డి, మణికొండ

నీటి సమస్యలు తీరతాయి..



తమ ఇంటి ముందు నుంచే గక్యాండూట్ ద్వారా గండిపేట నీరు సరఫరా అవుతున్నా వినియోగించుకోలేని పరిస్థితి. ఇప్పుడు ఈ నీటిని ఇక్కడే ఫిల్టర్ చేసి సరఫరా చేయడం ఆనందంగా ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంజీరా నీరు సరిపోకపోవడం, అదనంగా తీసుకునే అవకాశం లేకపోవడంతో తక్కువగానే నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం అదనపు నీరు అందుబాటులోకి రావడంతో ఇక తమ నీటి సమస్యలు తీరుతాయి.

– కాంతారావు, సెక్రటేరియట్ కాలనీ

నెల రోజుల్లో పనులు పూర్తి..



మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ ప్రజల నీటి సమస్యలను తీర్చేందుకు ఇప్పటికే 40 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న 4 రిజర్వాయర్లు, 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల 2 ఫిల్టర్ బెడ్‌లను అందుబాటులోకి తెచ్చాం. మరో నెల రోజుల్లో 50 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న మూడు రిజర్వాయర్లు, మూడు చోట్ల 9 లక్షల లీటర కెపాసిటీ గల ఫిల్టర్ బెడ్‌లు అందుబాటులోకి తెస్తాం. ఇవి అందుబాటులోకి వస్తే మంజీరా నీటి సరఫరా నిలిచినా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అలాగే హిమాయత్‌సాగర్ నీటిని కూడా వాడుకునేలా ఫిల్టర్‌బెడ్‌ల ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– రవీందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, జలమండలి

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉప్పర్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ మాట్లాడారు. రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర స్పీకర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఉత్సవాల అనంతరం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్‌కు పితృవియోగం

శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ తండ్రి సాతాంరాయి గ్రామ మాజీ సర్పంచ్ జంగయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు పలువురు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి జంగయ్య పార్థీవదేహం వద్ద నివాళులర్పించారు.

వృద్ధుడి అదృశ్యం


ఏసురత్నం

మణికొండ: ఇంట్లో నుంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంధంగూడలో గురువారం జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంధంగూడలోని వెస్ట్ ఎండ్ కాలనీకి చెందిన బీటీ ఏసురత్నం గురువారం తెల్లవారుజామున 4 గంటలకు ఇంటి నుంచి వెల్లాడు. అర్ధరాత్రి అయినా తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని అల్లుడు వినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వెళ్లే ప్రధాన రహదారిలోని పల్లాడియం ఫంక్షన్ హాల్ సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. మృతుడి వయస్సు (55) భిక్షటన చేసే వ్యక్తిగా గుర్తించి ఆహారం లేక మృతి చెంది ఉండవచ్చని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రం నిధులతోనే పనులు

ప్రజా ఆశీర్వాద యాత్రలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మండలంలోని షాపూర్‌తండాలో మహిళలకు నమస్కరిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నాటి సీఎం కేసీఆర్ అభివృద్ధి పనులు చేపట్టి తన గొప్పను చెప్పుకున్నారని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్మించిన రైతువేదికలు, వైకుంఠధామాలు, రోడ్లకు పీఎం మోదీ నిధులు మంజూరు చేస్తే.. కేసీఆర్ వాటిని తన ఖాతాలో వేసుకుని ప్రచారం చేశారన్నారు. చైనా, పాకిస్తాన్ నుంచి దేశాన్ని రక్షిస్తూ దేశంలోని నిరుపేదలదను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. దేశం తర్వాతనే కుటుంబం అనే విధానంతో మోదీ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించి మూడోసారి కూడా మోదీని ప్రధాని పీఠంపై కూర్చొబెడుదామని అభ్యర్థించారు. యాత్ర ముచ్చింతల్, మదన్‌పల్లి కొత్తతండా, షాపూర్‌తండా, సంఘీగూడ, గుర్జుగడ్డతండా, హమీదుల్లానగర్, శంకరాపురం, పోశెట్టిగూడ, బహదూర్‌గూడ, రషీద్‌గూడ, గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ వార్షికోత్సవం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి సుప్రభాత సేవ, దేవతాభిషేకాలు, దీపారాధన, వార్షికోత్సవ సంకల్పం, విగ్నేశ్వర పూజ, రక్షాబంధనం తదితర కార్యక్రమాలతో పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం బ్రహ్మాది మండల స్థాపన, లక్ష్మీస్థాపనం, రుద్రపీఠ స్థాపనం, ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్థాపనం, నవగ్రహ దేవత పూజ, నవగ్రహ హోమం, గణపతి హోమం, రుద్ర హోమం, మండల హోమం, చండీ హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహా నైవేద్యం అనంతరం భక్తులందరికీ మధ్యాహ్నం 2 గంటలకు అన్న ప్రసాద వితరణ కొనసాగుతుందన్నారు. ఇందుకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

వ్యక్తి అదృశ్యం


యాకయ్య

గచ్చిబౌలి: డ్యూటీకి వెళ్లకుండా మద్యం తాగుతూ కాలం గడుపుతున్నావంటూ భార్య మందలించడంతో మనస్తాపం చెందిన భర్త అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసం ఉండె కె.యాకయ్య(32) డీసీఎం డ్రైవర్. కొద్ది రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా మద్యం తాగుతుండడంతో భార్య ధనలక్ష్మీ డ్యూటీకి వెళ్లాలని మందలించింది. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో సమీప ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యూజీసీ సభ్యుడిగా సచ్చిదానంద మహంతి



రాయదుర్గం: యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) సభ్యుడిగా మూడేళ్ల కాలపరిమితితో హెచ్‌సీయూ మాజీ ప్రొఫెసర్ సచ్చిదానంద మహంతికి అవకాశం కల్పించారు. మాజీ ప్రొఫెసర్, హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ విభాగం అధిపతిగా ఆయన పనిచేశారు. భారత ప్రభుత్వం ఉన్నత విద్య మంత్రిత్వశాఖ నియమించింది. ఆయన జాతీయ, అంతర్జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ యూనివర్శిటీ చండీఘడ్‌లో అరబిందో చైర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

యువత కోసం.. సాల్వ్ ఫర్ టుమారో..

సాక్షి,సిటీబ్యూరో: సామాజిక ప్రయోజనం కలిగిన ఆవిష్కరణలు, పర్యావరణహిత పరిష్కారాల పట్ల నగర యువతలో ఆసక్తిని ప్రోత్సహిస్తూ ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్ శామ్‌సంగ్ ఆధ్వర్యంలో ఐఐటీ ఢిల్లీ, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ, యునైటెడ్ నేషన్స్ ఇండియాల భాగస్వామ్యంతో సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమం ప్రారంభమైంది. దీనిలో భాగంగా 14–17ఏళ్ల మధ్య వయస్కులైన పాఠశాల విద్యార్థుల కోసం స్కూల్ ట్రాక్ విభాగం కింద సమాజం–ఆవిష్కరణ థీమ్‌ను, అదే విధంగా 18–22 మధ్య వయస్కుల కోసం యూత్ ట్రాక్ పేరిట పర్యావరణం–సస్టెయినబులిటీ థీమ్‌లను ఎంచుకుని దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. స్కూల్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.25లక్షల గ్రాంట్‌ను, యూత్ ట్రాక్ విభాగంలో గెలుపొందిన బృందం రూ.50లక్షల గ్రాంట్‌ను అందుకుంటాయన్నారు. మే 31వ తేదీ వరకూ www.samsung.com/in/solvefortomorrow ద్వారా దరఖాస్తులు పంపవచ్చునని తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అబ్దుల్లానగర్, రాజీవ్ గాంధీకాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సుదే కీలకపాత్ర

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజినీరింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, నేటి వ్యవస్థలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యత చాలా పెరిగిందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలో ఎస్కీ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ సహకారంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్స్ ప్రాముఖ్యతపై ఒక రోజు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు.ఈ సందర్భం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విస్తారమైన డేటాను విశ్లేషించడానికి, అల్గారిథమ్‌లను ఉపయోగించడం ద్వారా ఆధునిక యుగంలో ఔత్సాహిక ఇంజనీర్లకు కీలకమైన నైపుణ్యతతో కూడిన ఏఐ, ఎంఎల్ సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడంలో శక్తివంతమైన పాత్రను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పోషిస్తుందన్నారు. ఫ్యూచర్లీ ఇంక్, ఫైట్ క్లబ్ సహ వ్యవస్థాపకుడు ప్రమోద్, వాల్‌మార్ట్ ల్యాబ్స్, ఫైట్ క్లబ్ నుంచి స్టాఫ్ డేటా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ నితిన్ కిషోర్, ఏఐ యొక్క విస్తృతమైన అప్లికేషన్‌లపై తమ అనుభవాలను పంచుకున్నారు. జోగినిపల్లి భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి ఏఐ, ఎంఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ జే శాంతి, దుర్గాభవాని, ఎస్కీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి సాయికిషోర్ ప్రసంగించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ. 2.71 లక్షలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం

మాదాపూర్: పేకాటాడుతున్న 9 మందిని గురువారం రాత్రి మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని చంద్రనాయక్‌తండాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు ముద్దాల వెంకట కృష్ణారావుతో పాటు 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.71 లక్షల నగదు, 9 మొబైల్ ఫోన్‌లు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలో ప్రధాని మోదీ హవా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


గుడిమల్కాపూర్ పద్మానాభనగర్ కాలనీలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రచారం

గోల్కొండ: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ హవా కొనసాగుతుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ పద్మానాభనగర్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో మన దేశం ప్రపంచ అగ్రదేశాల సరసన చేరిందన్నారు. ప్రధాని తీసుకుంటున్న ఎన్నో నిర్ణయాలు భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాయన్నారు. భారతదేశం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల దేశం ప్రపంచ అగ్రరాజ్యాల ఆర్థిక రంగానికి ధీటుగా నిలుస్తున్నాయన్నారు. దౌత్య పరంగా కూడా మన దేశం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని ఆయన అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి లేదని ఆయన అన్నారు. తెలంగాణలో పదేళ్ల అధికారం చెలాయించిన బీఆర్ఎస్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అందుకే ప్రజలు దానిని తిరస్కరించారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని అధికారులు తన గుప్పిట్లో పెట్టుకున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కేవలం అభివృద్ధి ఎజెండాతోనే తమ పార్టీ ముందుకు సాగుతుందని ఉత్తుత్తి హామీలు ఇవ్వకుండా పటిష్టమైన ప్రణాళికలు అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా నూతన పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ నిర్మూలనకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. రోడ్డు పొడవునా ఆయన తనకు స్వాగతం పలుకుతున్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయన వెంట హైదరాబాద్ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు తదితరులున్నారు.